## అలియాబాద్, సిద్దాపూర్‌లో
# అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు

- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి సానుకూలత
- కలెక్టర్, ఆర్డీవోలకు ఆదేశాలు
- గతంలో కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన పట్టాలను ఆపిన బీఆర్ఎస్
- మంత్రికి వివరించిన మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, ఫిబ్రవరి 10: సంగారెడ్డి నియోజకవర్గంలోని అర్హులైన పేదలకు త్వరలోనే కొండాపూర్ మండలం అలియాబాద్, సదాశివపేట మండలం సిద్దాపూర్‌లో ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. ఈ ప్రాంతాల్లో సుమారు 9వేల మంది పేదలకు గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిందని మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డి శనివారం గాంధీభవన్‌కు రాగా ఆయనను జగ్గారెడ్డి కలిసి ఇళ్ల స్థలాల విషయం వివరించారు. కొండాపూర్ మండలం అలియాబాద్‌లో నాలుగు వేల మందికి, సదాశివపేట మండలం సిద్దాపూర్‌లో ఐదు వేల మందికి ఉమ్మడి రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఇచ్చిందని తెలిపారు. తాను ఇళ్ల పట్టాలు ఇప్పిస్తే తరువాత వచ్చిన బీఆర్ఎస్ సర్కారు ఇవ్వకుండా దాటవేసిందని తెలియజేశారు. పట్టాలు చేత పట్టుకుని పొజిషన్ కోసం పేదలు అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయిందని పేర్కొన్నారు. పట్టాలు పొందిన పేదలకు పొజిషన్ ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేసిందని వివరించారు. పేదలతో కలిసి తాను పలుమార్లు ఆందోళన చేసినా పట్టించుకోలేదని విమర్శించారు. పేదల పక్షపాతిగా ఉండే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినందున తమ హయాంలో అలియాబాద్, సిద్దాపూర్‌లలో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు వెంటనే పొజిషన్ ఇప్పించాలని మంత్రిని కోరారు. గతంలో మంజూరు చేసిన ప్రకారం ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నాయని ఆయన వివరించారు. ఇందుకు స్పందించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్డీవోలకు ఫోన్ చేసి గతంలో ఇళ్ల స్థలాలు పొందిన అర్హులైన పేదలకు పొజిషన్ ఇప్పించాలని ఆదేశించినట్టు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలిపారు.


రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి

## బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే..

### ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



ఎన్నికల్లో ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుంది. ఇప్పటికే రెండు హామీలను నెరవేర్చాం. ఆరు గ్యారంటీలను కూడా ప్రజలకు అందించడానికి ఈ బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు జరిగాయి. గత ప్రభుత్వాలు మేనిఫెస్టోలను పట్టించుకోలేదు. కానీ, మా ప్రభుత్వం ప్రజాపాలన దిశగా అడుగులు వేస్తుందనడానికి ఈ బడ్జెట్ నిదర్శనంగా నిలుస్తోంది.

**- తూంకుంట నర్సారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు**

### అంకెల గారడీ.. ఎలాంటి ప్రయోజనం లేదు



అంకెల గారడితో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌తో తెలంగాణ ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ప్రకటించారు. కానీ, ఆ దిశగా బడ్జెట్‌లో నిధులు విడుదల చేయలేదు. రైతుల రుణమాఫీ, పింఛన్ల పెంపు, రైతుబంధు పెంపు గురించి సరైన స్పష్టత ఇవ్వకపోవడం అనేక సందేహాలకు దారితీస్తున్నది.

**- కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు**

### అన్ని రంగాలకు ప్రాధాన్యత



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం గతంలో కంటే మెరుగైనా నిధులను ఈ బడ్జెట్‌లో కేటాయించారు. ఆరు గ్యారంటీల అమలు కోసం రూ.53వేల కోట్లను కేటాయించి బలహీన వర్గాలకు పెద్దపీట వేశారు. అదే విధంగా పంచాయతీరాజ్, విద్యుత్, పురపాలక, నీటిపారుదల శాఖలకు ప్రాధాన్యత కల్పించారు. ఇది ప్రజాసంక్షేమ బడ్జెట్.

**- మంద పవన్, సీపీఐ జిల్లా కార్యదర్శి**

### చేతగాక చేతులెత్తేశారు



కాంగ్రెస్ పార్టీ హామీలు ఇచ్చినట్లుగా ఆరు గ్యారంటీలను అమలు చేయాలంటే రూ.5 లక్షల కోట్లు కావాలి. కానీ కేవలం రూ.53వేల కోట్లే బడ్జెట్‌లో కేటాయించారు. ఈ నిధులను కూడా ఎక్కడి నుంచి సమకూర్చుతారో స్పష్టం చేయలేదు. సంక్షేమ పథకాలను అమలు చేయడం తమ వల్లకాదనే విషయాన్ని చెప్పకనే చెప్పారు. బీఆర్ఎస్ తరహాలోనే కాంగ్రెస్ కూడా వంచనకు పాల్పడుతున్నది.

**- గంగాడి మోహన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు**

### మోసపూరిత బడ్జెట్



కాంగ్రెస్‌ది నయవంచన ప్రభుత్వమని మరోసారి తేలింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలను నిలబెట్టుకోలేదనే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. కానీ వీరు మాటల గారెడీ, అంకెల గారడీతోనే సరిపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబరు 9నే రైతు రుణమాఫీకి సంతకం పెడుతామన్న హామీ ఏమైంది. నిరుద్యోగభృతి, ఆరు గ్యారంటీలను ఎలా అమలు చేస్తారనే అంశం బడ్జెట్‌లో లేదు. కేవలం మోసపూరిత బడ్జెట్ ఇది.

**- అంబటి బాలేష్‌గౌడ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు**



# పథకాల పద్దు
## రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట

- ఆరు గ్యారంటీల పథకాలకు నిధుల వరద
- జిల్లాకు 12వేల వరకు ఇందిరమ్మ ఇళ్లు
- 26 మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
- నీటిపారుదల నిధులతో పెండింగ్ పనులపై ఆశలు
- చేర్యాల, దుబ్బాక కొత్త డివిజన్లపై అస్పష్టత
- కొమురవెల్లి మల్లన్నపై కటాక్షమేది ?

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 10 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు దిశగా తాజా బడ్జెట్‌లో పెద్దఎత్తున నిధులు కేటాయించారు. తమది సంక్షేమ బాట అంటూ నిధుల రూపంలో చెప్పకనే చెప్పారు. గ్యారంటీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఉండేలా చూసుకున్నారు. అదేవిధంగా నీటిపారుదల, విద్యావైద్యం, వ్యవసాయ రంగాలకూ పెద్దపీట వేసేలా పద్దు రూపొందించారు. శనివారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి ప్రత్యేక తలైతే లేనప్పటికీ సంక్షేమ పరంగా కేటాయింపులు చేశారు.

### కాలువల నిర్మాణం.. పరిహారంపై ఆశలు


కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో భాగంగా జిల్లాలో నిర్మించిన రంగనాయకసాగర్, కొమురవెల్లి మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్లకు సంబంధించి కాలువల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అదే విధంగా భూనిర్వాసితుల పరిహారం ఇంకా చెల్లించాలనే డిమాండ్లు ఉన్నాయి. ప్రస్తుత బడ్జెట్‌లో నీటిపారుదల శాఖకు రూ.28వేల కోట్ల పైచిలుకు నిధులు కేటాయించడంతో ఆశలు చిగురించాయి. ఆయకట్టు విస్తీర్ణం పెరగాలంటే వెంటనే కాలువల పనులు చేపట్టాల్సి ఉంది. గౌరవెల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులకూ ఈ నిధులను వినియోగిస్తే మెట్ట ప్రాంతం సస్యశ్యామలంగా మారుతుంది.

### మండలానికో స్కూల్

ప్రతీ మండలంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఈ లెక్కన జిల్లాలోని 26 మండలాల్లో ఈ స్కూళ్లను ఏర్పాటు చేసే అవకాశం ఉంది. జిల్లాలోని గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించడానికి నిధులు కేటాయించారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.21,389 కోట్లు ప్రతిపాదించారు. గత ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమానికి ఈ నిధులను మళ్లిస్తారా.. లేదా వేచిచూడాలి. పురపాలక శాఖకు బడ్జెట్‌లో రూ.11,692 కోట్ల నిధులు కేటాయించడం ఆశాజనకమైన విషయం. ఎందుకంటే జిల్లాలో సిద్దిపేట, దుబ్బాక, చేర్యాల, హుస్నాబాద్, గజ్వేల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. చేర్యాల, దుబ్బాక, హుస్నాబాద్ పట్టణాలకు భారీగా నిధుల అవసరం ఉంది. అంతర్గత రోడ్లు, సుందరీకరణ, నీటి సరఫరా, పారిశుధ్యం, మొక్కల పెంపకం, డ్రైనేజీలపై దృష్టి పెట్టాల్సి ఉంది.

### తప్పని నిరాశ

- దుబ్బాక, చేర్యాల రెవెన్యూ డివిజన్లకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావిస్తారని అంతా భావించినా నిరాశే ఎదురైంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలన్నీ ఈ రెండు కొత్త డివిజన్ల గురించి సానుకూలంగా స్పందించాయి. కానీ, బడ్జెట్‌లో స్పందన లేకపోయింది.
- రాష్ట్రంలోని పలు దేవాలయాల అభివృద్ధి గురించి బడ్జెట్ నివేదికలో పేర్కొన్నారు. కానీ, జిల్లాకు సంబంధించిన కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయం, కొండపోచమ్మ ఆలయం, నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాల గురించి ప్రస్తావించలేదు. ప్రధానంగా కొమురవెల్లి మల్లన్న ఆలయానికి నిధుల అవసరం ఎంతో ఉంది.



### 'గ్యారంటీ'లకు కేటాయింపులు : మంత్రి పొన్నం



హుస్నాబాద్, ఫిబ్రవరి 10 : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు చేసిందన్నారు. మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీకి నెలకు రూ.300 కోట్ల చొప్పున అదనపు నిధులు కేటాయించారని, రాజీవ్ ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి రూ.500 గ్యాస్‌లకు కలిపి రూ.53,196 కోట్లు, బీసీ సంక్షేమం కోసం రూ.800 కోట్లు, బీసీ గురుకుల భవనాల కోసం రూ.1,546 కోట్లు కేటాయించారని తెలిపారు.

### నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు



నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని బడ్జెట్‌లో ప్రకటించారు. దీంతో జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలకు 14 వేల ఇండ్లు మంజూరు కావాల్సి ఉంటుంది. అయితే ఈ నియోజకవర్గాల్లోని 9 మండలాలు మెదక్, కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లో ఉంటాయి. అదే విధంగా జనగామ, మానకొండూరు నియోజకవర్గాల్లోని ఐదు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. కనీసం 12వేల ఇళ్లు జిల్లాకు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలోనూ గృహలక్ష్మి పేరిట ఇచ్చిన ఇంటి మంజూరు పత్రాలపై నేటికీ స్పష్టత లేదు. మరి కొత్త లబ్ధిదారుల ఎంపికకు ఎలాంటి మార్గదర్శకాలు విడుదల చేస్తారో వేచిచూడాలి.

# గ్రూప్-4లో జిల్లావాసుల సత్తా

- 205.868 మార్కులతో 44 ర్యాంకు సాధించిన అభ్యర్థి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 10 : రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి విడుదల చేసిన గ్రూప్-4 ఫలితాలలో జిల్లా యువత సత్తా చాటారు. రాష్ట్రం మొత్తంలో 8,000 పైచిలుకు పోస్టులకు సుమారు 7 లక్షల మంది పరీక్ష రాయగా, జిల్లాలో ఉన్న 233 గ్రూప్-4 పోస్టులకు 26,000 మంది అభ్యర్థులు పరీక్ష రాశారు. గత సంవత్సరం జూలై 31వ తేదిన పరీక్ష నిర్వహించారు. ఎట్టకేలకు శుక్రవారం రాత్రి గ్రూప్-4 ఫలితాలు విడుదలయ్యాయి. ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ర్యాంకుతో పాటు మార్కులను విడుదల చేశారు. గ్రూప్-4 ఫలితాల్లో జిల్లాకు చెందిన ఇద్దరు పురుషులు 205.868 మార్కులతో రాష్ట్రంలో 44వ ర్యాంకు, 204.410 మార్కులతో 63వ ర్యాంక్ దక్కించుకున్నారు. వీరితోపాటు పలువురికి 119, 128, 161, 189, 201, 213, 216, 243, ర్యాంకులు సాధించారు. జిల్లాకు చెందిన మహిళ 195.312 మార్కులతో రాష్ట్రస్థాయిలో 269వ ర్యాంక్ దక్కించుకుంది. మూడు నాలుగు రోజులలో కేటగిరి వైజ్‌గా ఫలితాలను విభజించి త్వరలోనే కౌన్సెలింగ్ ద్వారా జిల్లాలో ఉన్న 233 పోస్టులు భర్తీ చేయనున్నారు.


విద్యుత్ కాంతులతో కూడవెల్లి రామలింగేశ్వర జాతర

# కూడవెల్లి.. ప్రణమిల్లి

*రెండోరోజు ఘనంగా రామలింగేశ్వరుడి జాతర*

దుబ్బాక, ఫిబ్రవరి 10 : అక్బర్‌పేట - భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి రామలింగేశ్వరాలయం జాతర రెండోరోజైన శనివారం కన్నులపండుగగా కొనసాగింది. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి భక్తుల సందడి నెలకొన్నది. శనివారం సుమారు లక్ష మంది భక్తులు తరలివచ్చినట్లు దేవాదాయశాఖ అంచనా వేసింది. శనివారం ఉదయం నుంచే స్వామివారికి విశేష పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం పల్లకీసేవ అంగరంగ వైభవంగా కొనసాగింది. దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, స్వామివారిని సందర్శించుకున్నారు. దుబ్బాక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.


రామలింగేశ్వరుడి పల్లకిసేవ



## కిక్కిరిసిన పుల్లూరు బండ

7

- లక్ష్మీనర్సింహస్వామి ఊరేగింపు
- రెండోరోజు భారీగా తరలివచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పుల్లూరు ఏకశిల బండపై భక్తుల సందడి

# ప్రయాణం.. ప్రాణసంకటం

- జాతీయ రహదారిలో విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం
- హెచ్చరికల బోర్డుల ఏర్పాటులో అలసత్వం
- తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

చేర్యాల, ఫిబ్రవరి 10 : సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారిలో భాగంగా చేర్యాల పట్టణ పరిధిలో కొనసాగుతున్న జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యత, ప్రమాణాలలేమితో పాటు హెచ్చరికల బోర్డుల ఏర్పాటులో పట్టింపులేనితనంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. పనుల్లో డొల్లతనం బయల్పడుతుండటంతో పాటు వరుస ప్రమాద సంఘటనలు చోటుచేసుకున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.


చేర్యాలలోని సెవెన్‌హిల్స్ సమీపంలో తీసిన గోతిలో పడి ఇరుక్కున్న కారు

### కల్వర్టు గోతిలో కారు బోల్తా

చేర్యాల పట్టణంలోని సెవెన్‌హిల్స్ హోటల్ సమీపంలోని కల్వర్టు నిర్మాణం కోసం రోడ్డును తవ్వి భారీ గోతులు తీశారు. అయితే, ఇక్కడ టేక్ డైవర్షన్ ప్రమాద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ, రోడ్డు పని కొనసాగుతున్నందున నెమ్మదిగా వెళ్లాలన్న బోర్డు మాత్రమే పెట్టారు. దీంతో గోతి తీసిన విషయం తెలియని ఓ వాహనదారుడు ఇదేదారి గుండా కారులో వెళ్లడంతో శుక్రవారం రాత్రి కల్వర్టు గోతిలో పడిపోయారు. దీంతో కారు ముందరిభాగం కొంతమేర దెబ్బతిన్నది. వెనకటైరు పట్టీలు రోడ్డుఅంచున నిలవడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెనకడోరు నుంచి బయటపడ్డారు. స్థానికులు కాంట్రాక్టర్‌తో పాటు అధికారుల తీరుపై మండిపడ్డారు.

### ఆపరేటర్ నిర్లక్ష్యానికి మహిళ మృతి

స్థానిక ఐవోసీ పెట్రోల్‌పంపు సమీపంలో ఎలాంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకుండా కాటర్‌పిల్లర్ మిషన్ ఆపరేటర్ ఇయర్‌ఫోన్స్ పెట్టుకుని కంకర లెవల్ పనులు చేస్తుండగా వెనక నుంచి వస్తున్న మోపెడ్‌బైక్‌ను ఢీకొన్నాడు. దీంతో మండలంలోని దొమ్మాట గ్రామానికి చల్లా లక్ష్మి దుర్మరణం చెందగా, ఆమె బంధువు ప్రాణాలతో బయటపడ్డారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు సమీపంలో చీకటి కారణంగా ఇటీవల బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు గాయాలపాలయ్యారు. రోజు ఎక్కడో ఓ చోట వాహనాలు బోల్తాపడుతూనే ఉన్నాయి.

### పనుల్లోనూ డొల్లతనం

రోడ్డు నిర్మాణం పనుల్లోనూ నాణ్యత, ప్రమాణాలు పాటించడం లేదు. కొద్దిరోజుల క్రితం పలు ప్రదేశాలలో రోడ్డుకుంగిపోయింది. కంకర మిశ్రమాన్ని సమపాళ్లలో నీరుపట్టి రోలింగ్ చేయకపోవడంతో పలు వాహనాలు దిగబడుతున్నాయి. సెంట్రల్ డివైడర్ నిర్మాణం చేస్తుండగానే ఊడిపోతుంది. డ్రైన్ కాలువ పనుల్లో అస్తవ్యస్తంగా కొనసాగిస్తుండటంతో రోడ్డుపక్కన భవనాల యాజమానులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.


ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయిస్తున్న అధికారులు

### ఉద్రిక్తతల నడుమ కూల్చివేతలు

చేర్యాల, : జనగామ-సిద్దిపేట జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేర్యాల పట్టణంలో రోడ్డుకిరువైపులా 50 ఫీట్లలోపు నిర్మాణాల తొలగింపునకు శనివారం మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకున్నారు. పలువురు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకున్నది. రహదారి నిర్మాణంలో భవనాలు కోల్పోతుండటంతో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణకు గతంలోనే మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ 50 ఫీట్ల లోపు గల బాల్కనీలు, పైకప్పులు ఏమీ ఉన్నా త్వరితగతిన తొలగించుకోవాలని, లేందటే ఎన్‌హెచ్, మున్సిపల్ శాఖ సంయుక్తంగా సిబ్బందితో కూల్చివేయిస్తామని హెచ్చరించారు.

# విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

● పరీక్షలంటే భయం వీడాలి ● మెదక్ కలెక్టర్ రాజర్షిషా



ప్రేరణ తరగతుల కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 10: విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని చదవాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. శనివారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో పదో తరగతి విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రేరణ తరగతులను కలెక్టర్ సావిత్రిబాయి పూలే జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం.. ఒత్తిడికి గురికాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. జీవితంలో ఏది సాధించాలన్నా చదువు తప్పనిసరని, సందేహాలు తొలగించడానికి ప్రేరణ తరగతులు బాగా ఉపయోగపడుతాయన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ఉన్నతమైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు ఉన్నత చదువులపై ప్రేరణ కల్పిస్తూ... పదిలో శత శాతం ఫలితాలే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 22 బీసీ వసతి గృహాల్లో 222 మంది పది విద్యార్థులు ఉన్నారని, పరీక్షల సమయంలో వార్డెన్లు ప్రత్యేక దృష్టిసారించి చదివించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులను అందజేశారు. ఈ సమావేశంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నరేందర్, రాజ్‌కుమార్, జిల్లా అదనపు బీసీ సంక్షేమాధికారి నాగరాజు గౌడ్, నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి, పుల్లూరుబండ జాతరలో భక్తుల రద్దీ

# కిక్కిరిసిన పుల్లూరుబండ

● ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం ● ఆధ్యాత్మికతను సంతరించుకున్న ఆలయ పరిసరాలు

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 10: సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు బండ జాతర రెండోరోజు భక్తులతో కిక్కిరిసింది. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ రంగాచారి, వంశపారంపర్య అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి గోపాల కాల్వలు సేవ, సుదర్శన నారసింహ హోమం, విష్ణుసహస్ర నామ పారాయణం నిర్వహించి, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి బండపై ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పరిసరాలు ఆధ్యాత్మికతను సంతరించుకున్నాయి. జాతర సందర్భంగా బండపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల, ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు వస్తున్న నేపథ్యంలో వారికి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు అధికారులతో కలిసి అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా సిద్దిపేట రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీటి వసతితో పాటు, అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే విధంగా వైద్య సదుపాయం కూడా కల్పించారు. పుల్లూరు బండ జాతరలో సిద్దిపేట రూరల్ మండలం జడ్పీటీసీ కోటగిరి శ్రీహరిగౌడ్, పలువురు ప్రముఖులు పాల్గొని లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్యగౌడ్, డైరెక్టర్లు, మాజీ సర్పంచ్ నరేశ్‌గౌడ్, ఎంపీటీసీ లతావెంకట్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రంగాచారి, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


లక్ష్మీ నరసింహస్వామి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

# నవోదయ 9, 11వ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతం

● దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు 2161 మంది
● పరీక్షకు 1548 మంది విద్యార్థుల హాజరు
● 613 మంది గైర్హాజరు


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్

వర్గల్, ఫిబ్రవరి 10: కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-2025 విద్యా సంవత్సరం కోసం 9వ తరగతి, 11వ తరగతిలో ప్రవేశానికి శనివారం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్, వర్గల్ నవోదయ విద్యాలయంలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ డి.రాజేందర్ తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 1052 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 773 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 273 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 1109 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. 775 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 334 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకు 73.47 శాతం, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 69.88 హాజరు శాతం నమోదైనట్లు తెలిపారు. 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 3 పరీక్షా కేంద్రాలు, 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. 9వ తరగతి, 11వ తరగతి ప్రవేశ పరీక్షకుగాను 2161 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1548 మంది పరీక్షకు హాజరుకాగా.. 613 విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

**పరిశీలించిన ఏసీపీ**

గజ్వేల్, ఫిబ్రవరి 10: జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షా కేంద్రాలను గజ్వేల్ ఏసీపీ మడత రమేశ్ శనివారం పరిశీలించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లోని ఆయా కేంద్రాలను సందర్శించిన ఆయన బందోబస్తు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను పటిష్టంగా అమలయ్యేలా చూశారు. వారితో గజ్వేల్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఒక ఎంపీ సీటు కోరతాం

● పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు
● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి


హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, ఫిబ్రవరి 10: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తాము కాంగ్రెస్ పార్టీతో కలిసి పోటీలో దిగే అవకాశాలు ఉన్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి చెప్పారు. ఒక వేళ అదే జరిగితే రాష్ట్రంలో ఒక ఎంపీ స్థానాన్ని తమకు ఇవ్వాలని కోరతామని అన్నారు. అయితే ఈ విషయమై ఇంకా ఎలాంటి చర్చలు జరగలేదని, అసెంబ్లీ సమావేశాల తర్వాత కలిసి మాట్లాడతామని వెల్లడించారు. శనివారం వెంకటరెడ్డి హుస్నాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడాన్ని జీర్ణించుకోలేక పోతోందని అన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చి 60 రోజులు కాకముందే దానిపై అనేక ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. దేశంలో ఇండియా కూటమి ద్వారానే ప్రజాస్వామ్య మనుగడ ఉంటుందని, కూటమిలో నుంచి కొంత మంది వెళ్లిపోయినా ఏం ఫర్వాలేదని అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో పాటు ఇరిగేషన్ ప్రాజెక్టులపై అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. భూములపై సర్వేనెంబర్ల వారీగా సమగ్ర సర్వే చేయాలని అన్నారు. నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీ అమలు చేయలేదని, మొహం చెల్లక ఇప్పుడు రాముడి పేరుతో ఆయన ఓట్లు అడుగుతున్నారని వెంకట రెడ్డి దుయ్యబట్టారు.

# దేవాదుల కాలువలో వ్యక్తి అస్థిపంజరం

● నాగపురి శివారు కొండపోచమ్మ ఆలయ సమీపంలో గుర్తింపు


దుబ్బాక సుభాష్ (ఫైల్)

చేర్యాల, ఫిబ్రవరి 10: చేర్యాల మండలం నాగపురి గ్రామశివారు, కొండపోచమ్మ ఆలయ సమీపంలోని దేవాదుల కాలువలో ఓ వ్యక్తి అస్థిపంజరం శనివారం లభ్యమైంది. అనుమానాస్పద స్థితిలో కొద్దిరోజుల క్రితం కాలువలో పడిపోవడంతో మృతదేహం కుళ్లిపోయింది. దుర్వాసన వెదజల్లడంతో చుట్టుపక్కల వారు గమనించి కొమురవెల్లి పోలీసులకు సమాచారమందించడంతో ఎస్ఐ నాగరాజు మృతదేహాన్ని వెలికి తీయించారు. అయితే విచారణ చేపట్టిన పోలీసులు మృతదేహం హైదరాబాద్ నగరం మల్లాపూర్ గ్రామానికి చెందిన దుబ్బాక సుభాష్‌గా గుర్తించారు. గతనెల 23న కొండపోచమ్మ ఆలయ సందర్శనార్థం వచ్చిన క్రమంలో తప్పిపోయాడని ఇటీవల జగదేవ్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దీంతో మృతదేహం ఆనవాలు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారమందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని అంగీకరించారు. వారి సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడికి మతిస్థిమితం సరిగా లేనందున తప్పిపోయి కాలువలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు తెలిపారు.

# 'ఇథనాల్' నిర్మాణానికి అనుమతులున్నాయి

● ఫ్యాక్టరీకి సంబంధించి ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు
● సిద్దిపేట రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్
● ఫ్యాక్టరీకి అనుమతులు ఇస్తే ఆందోళన చేస్తాం


ఫ్యాక్టరీ ఎదుట పెట్రోల్ క్యాన్, పురుగుల మందు డబ్బాతో నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

బెజ్జంకి, ఫిబ్రవరి 10: ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని, ఫ్యాక్టరీకి సంబంధించిన ఆస్తులు ధ్వంసం చేస్తే చర్యలు తప్పవని సిద్దిపేట రూరల్ సీఐ ఎం.శ్రీనివాస్ హెచ్చరించారు. బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామ శివారులో 557, 559, 561 సర్వే నెంబర్లలో చేపట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం రోజురోజుకూ వివాదమవుతున్నది. కొద్దినెలలుగా ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ఆపేయాలని గ్రామస్థులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ నిర్మాణంపై గ్రామస్థులకు అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుగ్గిళ్ల గ్రామ శివారులో నిర్మిస్తున్న సదరు కంపెనీకి ప్రభుత్వపరంగా అన్నిరకాల అనుమతులు ఉన్నాయని, కంపెనీ యథావిధిగా పనులు కొనసాగిస్తున్నదని తెలిపారు. కంపెనీ నిర్మాణం పట్ల గ్రామస్థులకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే లీగల్‌గా వెళ్లాలని సూచించారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించి ఆస్తులు ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కాగా అవగాహన సమావేశం అనంతరం గ్రామస్థులు ఫ్యాక్టరీ ఎదుట పురుగుల మందు డబ్బాలతో, పెట్రోల్ క్యాన్‌తో నిరసన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ పేరుతో తమ భూములను నిర్వీర్యం చేస్తే చూస్తూ ఊరుకోమని, ఎలాంటి పోరాటాలకైనా సిద్ధమవుతామని హెచ్చరించారు. మీ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఎస్ఐ నరేందర్ రెడ్డి, గుగ్గిళ్ల గ్రామస్థులు పాల్గొన్నారు.


గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో సిద్దిపేటకు డబుల్ గోల్డ్ మెడల్స్



జితేష్‌ను అభినందిస్తున్న అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 10: తెలంగాణ 9వ సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా శనివారం భద్రాద్రి కొత్తగూడెంలో నిర్వహించిన స్టాండింగ్ బ్రాడ్ జంప్, పరుగు పందెంలో సిద్దిపేటకు రెండు గోల్డ్ మెడల్స్ దక్కాయి. సిద్దిపేట క్రీడాకారుడు గాడిచర్ల జితేష్ స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో 1.94 మీటర్లు ప్రథమ స్థానంలో, 300 మీటర్లు పరుగు పందెం 49 సెకన్లలో పూర్తిచేసి ప్రథమ స్థానంలో నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించాడు. ఈ మేరకు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి క్రీడాకారులకు గోల్డ్ మెడల్స్‌ను, మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేటకు డబుల్ గోల్డ్ మెడల్ రావడం అభినందనీయమని, క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో మరిన్ని క్రీడల్లో పాల్గొని అవార్డులను పొందాలన్నారు. గోల్డ్ మెడల్ సాధించినందుకు అథ్లెటిక్స్ అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి వెంకటస్వామి, కోచ్ కల్లపల్లి కృష్ణ అభినందించారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వసంత పంచమి మహోత్సవ ఆహ్వానం


మంత్రికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న విద్యాధరి క్షేత్రం సభ్యులు

వర్గల్, ఫిబ్రవరి 10 : వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఈ నెల 14న శ్రీ విద్యాసరస్వతీ అమ్మవారి సన్నిధిలో నిర్వహించే వసంత పంచమి (శ్రీపంచమి) మహోత్సవానికి రావాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విద్యాధరి క్షేత్రం ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆహ్వానపత్రికను అందజేశారు. మంత్రి స్పందిస్తూ తప్పకుండా హాజరవుతానని వారికి తెలిపారు. ఈ సందర్భంగా గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డికి వసంత పంచమి ఆహ్వాన పత్రికను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

## ఇబ్రహీంపూర్‌ను సందర్శించిన ఢిల్లీ బృందం


ఇబ్రహీంపూర్ గ్రామాన్ని సందర్శించిన ఢిల్లీ అధికారుల బృందం

నారాయణరావుపేట, ఫిబ్రవరి10: ఎంసీఆర్‌హెచ్ఆర్డీ అధ్వర్యంలో శనివారం మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామాన్ని ఢిల్లీలోని వివిధ శాఖలకు చెందిన సెంట్రల్ సెక్రెటేరియట్ అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా గ్రామంలో మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను వారు పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరిగిన వివిధ అభివృద్ధి పనులను సందర్శించారు. వారివెంట ఎంపీడీవో మురళీధర్‌శర్మ, ఎంపీవో శ్రీనివాస్, ఏవో వెంకట రమణి, కో ఆర్డినేటర్ భిక్షపతి, ఏపీవో స్రవంతి, పంచాయతీ కార్యదర్శి హర్శత్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజు ఉన్నారు.

# ప్రత్యేకాధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్


గంగాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

చిన్నకోడూరు, ఫిబ్రవరి 10: గ్రామపంచాయతీల ప్రత్యేకాధికారులు తమకు కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరిమా అగ్రవాల్ పేర్కొన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని గంగాపూర్ గ్రామాన్ని ఆమె సందర్శించి డంపింగ్ యార్డు, ఓవర్ హెడ్ ట్యాంకును, జీపీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి రోజూ గ్రామంలో చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించి, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపరచి, ప్రతీ ఇంటికి తాగునీటిని అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం డంపింగ్ యార్డు వద్ద సేంద్రియ ఎరువును కొనుగోలు చేసిన రైతుతో ఆమె మాట్లాడి సేంద్రియ ఎరువు పంటలకు ఏవిధంగా ఉపయోగపడుతుందో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమేష్, డీపీవో దేవకీదేవి, డీఎల్పీవో మల్లికార్జున్, ఎంపీవో సోమిరెడ్డి, మిషన్ భగీరథ ఈఈ గిరిధర్, డీఈ కృష్ణ, ఏఈ సాయికిరణ్, ప్రత్యేక అధికారి దివ్యజ్యోతి, పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో 27వేల మెట్రిక్ టన్నుల యూరియా

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్


పాలమాకుల పీఏసీఎస్‌లో నిల్వ ఉన్న యూరియాను పరిశీలిస్తున్న జిల్లా అధికారి శివప్రసాద్

నంగునూరు, ఫిబ్రవరి 10 : జిల్లావ్యాప్తంగా అన్ని ఎరువుల దుకాణాలలో 27 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ వెల్లడించారు. శనివారం నంగునూరు మండలంలోని పాలమాకుల, రాజగోపాల్‌పేట గ్రామాలను జిల్లా వ్యవసాయశాఖ అధికారి సందర్శించారు. ఈ సందర్భంగా పలు ఎరువుల దుకాణాలు, పంట పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఎరువుల దుకాణ యజమానులు ఈపాస్ మిషన్‌లో ఎరువుల అమ్మకాలు, నిల్వలను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని సూచించారు. మండలంలో రైతుల సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలతో పాటు వరిసాగు, పొద్దు తిరుగుడు పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత, ఏఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## కూడవెల్లిలో మాఘస్నానాలు పుణ్యప్రదం


రామలింగేశ్వరుడి సన్నిధిలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి10: కూడవెల్లి జాతరంటే కులమతాలకు అతీతంగా బండ్లు కట్టుకుని వచ్చే వాళ్లమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. శనివారం ఆయన అక్బర్‌పేట-భూంపల్లి మండలం రామేశ్వరంపల్లి రామలింగేశ్వరాలయాన్ని సందర్శించగా ఆలయ పూజారులు సాకేత శర్మ, శ్రీనివాస్‌శర్మ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూడవెల్లిలో మాఘ స్నానాలు చేస్తే సర్వపాపాలు హరిస్తాయని భక్తుల విశ్వసిస్తారని తెలిపారు. కూడవెల్లి రామలింగేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఆయన వెంట ఎస్సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కైలాస్‌ముదిరాజ్, నాయకులు ఉన్నారు.

## ఉపాధ్యాయుడికి జాతీయస్థాయి గుర్తింపు


ఉపాధ్యాయుడు నరేందర్‌కు అవార్డును అందజేస్తున్న అధినేత విల్సన్

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 10: జగదేవ్‌పూర్ మోడల్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నరేందర్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. శనివారం హైదరాబాద్‌లోని ఫ్రెండ్‌షిప్ మినిస్ట్రీస్ సంస్థ, అలురి అండ్ సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరివిల్లు కవితా సంపుటి ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాల సినీ గానలహరి ఆధ్వర్యంలో సామాజిక సేవా, విద్య, వైద్య రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినవారిని గుర్తించారు. వీరిలో జగదేవ్‌పూర్ మోడల్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు నరేందర్‌కు జాతీయస్థాయిలో అత్యుత్తమ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధినేత విల్సన్, మాజీ ఎంపీ వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో చీకట్లు

గజ్వేల్, ఫిబ్రవరి 10: గజ్వేల్‌లోని సంగాపూర్ రోడ్డులో గల బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో చీకట్లు అలుముకున్నాయి. రెండు రోజులుగా ఎడ్యుకేషన్ హబ్‌లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో విద్యార్థినులు బయటకు అడుగు పెట్టాలంటే జంకుతున్నారు. ఎడ్యుకేషన్‌హబ్‌లో కస్తూర్బా పాఠశాలతో పాటు ఆయా హాస్టళ్లు ఉన్నాయి. హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలలో తప్ప కళాశాల ప్రాంగణంలోని విద్యుత్ దీపాలు వెలగడం లేదు. దీంతో బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## నర్సరీ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల స్వీకరణ

ములుగు, ఫిబ్రవరి 10: సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధనా సంస్థలో రెండోసారి నర్సరీ ఏర్పాటుకు సర్టిఫికెట్ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ప్రోగ్రామ్ కోర్డినేటర్ ప్రొ.ఎం.సరిత తెలిపారు. డీబీటీ-టీఎస్ సీవోఎస్‌టీ అంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా నిరుద్యోగులకు సొంత వ్యాపారం ఏర్పాటు చేసుకునేవారికి నర్సరీల పెంపకం, వర్మికంపోస్ట్ తయారీ, తేనెటీగల పెంపకంపై ఆరునెలల శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. శిక్షణలో భాగంగా ప్రతి నెలా రూ. 10వేల స్టైఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. డిగ్రీ పూర్తయి అసక్తి గల అభ్యర్థులు అర్హులని, అభ్యర్థులు ఈ నెల 17లోగా దరఖాస్తును డౌన్‌లోడ్ చేసి మెయిల్‌కు పంపించాలన్నారు. వేర్వేరుగా సంస్థలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8074350866, 8466871929 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

## 'పది'లో ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు పురస్కారం

హుస్నాబాద్ టౌన్, ఫిబ్రవరి 10: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 2022-23లో 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వెల్దండి సత్యనారాయణ అనే ప్రవాస భారతీయుడు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సమక్షంలో నగదు పురస్కారాలు అందజేశారు. బాలికల, బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన సౌమ్య ఎం స్ఫూర్తి, ఎం అవినాష్ కె శ్రీకర్‌లకు రూ. 8000, రూ. 5000 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, హెచ్‌ఎం వాసుదేవరెడ్డి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, వెంకటరమణారెడ్డి, బండారి సువర్ణలీల, మార్కండేయ, రాజమల్లు, రమేశ్, శ్రీనివాస్, సుభాష్, శకుంతల, రమాదేవి తదితరులున్నారు.

## పీవీకి 'భారతరత్న' పై కాంగ్రెస్ నాయకుల సంబురాలు

హుస్నాబాద్, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని దివంగత పీవీ నర్సింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల శనివారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మెన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు తదితరులున్నారు.

## నేడు రాష్ట్రస్థాయి సూర్య నమస్కారాల పోటీలు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి10: సిద్దిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో ఈ నెల 11న ఆదివారం ఉదయం 6.30 గంటలకు రాష్ట్ర స్థాయి సూర్య నమస్కారాల పోటీలు జరుగనున్నట్లు సిద్దిపేట యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ప్రతినిధులు తోట అశోక్, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి, తోట సతీష్, కన్వీనర్ చిప్ప ప్రభాకర్, కో కన్వీనర్ గంగాపురం శ్రీనివాస్‌లు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. భారతీయ యోగా సంస్కృతిని సమాజానికి దగ్గర చేయడం, ఆరోగ్య ప్రపంచం నిర్మించడమే లక్ష్యంగా మొట్టమొదటిసారి రాష్ట్రస్థాయి సూర్య నమస్కారములు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 300 మంది యోగ సాధకులు పాల్గొననున్నట్లు తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి కింద రూ. 5వేల నగదు, రెండో బహుమతి కింద రూ. 3 వేల నగదు, మూడో బహుమతి కింద రూ. 2వేలు నగదుతో పాటు జ్ఞాపికలను, ఏడుగురికి చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

## పుకార్లు నమ్మొద్దు: సీఐ

రాయపోల్, ఫిబ్రవరి 10: చిన్నపిల్లలను ఎత్తుకుపోయే ఇతర రాష్ట్రాల గ్యాంగులు జిల్లాకు వచ్చాయని ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పుకార్లను నమ్మొద్దని, అలాంటి గ్యాంగ్‌లు ఏవీ రాలేదని తొగుట సీఐ లతీఫ్ పేర్కొన్నారు. శనివారం ఆయన రాయపోల్ ఎస్ఐ రఘుపతితో కలిసి రాంసాగర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తుల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, గజ్వేల్ షీటీమ్ సిబ్బంది శ్రీరాములు, ఏఎస్ఐ, మహిళా కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

### విద్యా ప్రాధాన్య బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం

హుస్నాబాద్, ఫిబ్రవరి 10: రాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా విద్యారంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించి రూ. 213879 కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్షుడు గంగిశెట్టి మహేందర్, ప్రధాన కార్యదర్శి టి సుశాంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణంవంటి వాటికి ప్రాధాన్యమివ్వడం శుభసూచకమన్నారు.

### అన్ని రంగాలకు ప్రాధాన్యత

సిద్దిపేట అర్బన్,ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని రంగాలకు ప్రాధాన్యత కల్పించేలా అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉందని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో 2024-25 సంవత్సరం ఆర్థిక బడ్జెట్ లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమం కోసం గతంలో కంటే మెరుగ్గా నిధులను కేటాయించి బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ బడ్జెట్ పూర్తిగా ప్రజాసంక్షేమ బడ్జెట్ అని ఆయన అన్నారు.

### బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి

గజ్వేల్, ఫిబ్రవరి 10: హామీల అమలుకు బడ్జెట్‌ను సవరించి నిధులను కేటాయించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి పేర్కొన్నారు. గజ్వేల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ 90లక్షల తెల్ల రేషన్ కార్డు దారులకు గృహజ్యోతి పథకం అమలు కావాలంటే రూ.8వేల కోట్లు కావాలని, కేవలం రూ.2,418 కోట్లు కేటాయించడం పట్ల గృహజ్యోతి అమలు ప్రశ్నార్థకమేనన్నారు. విద్యారంగానికి నిధుల కేటాయింపులో అన్యాయం జరిగిందన్నారు. వెంటనే బడ్జెట్‌ను సవరించాలన్నారు.

### దళితులకు అన్యాయం

గజ్వేల్‌టౌన్, ఫిబ్రవరి 10: రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు అన్యాయం జరిగిందని డీబీఎఫ్‌జాతీయ కార్యదర్శి శంకర్ విమర్శించారు. శనివారం రాష్ట్రబడ్జెట్‌పై ఆయన మాట్లాడుతూ 2011 జనాభా లెక్కలప్రకారం 15శాతం ఉన్న దళితులకు మొత్తం బడ్జెట్ 2.75 లక్షల కోట్లలో ఎస్సీల జనాభా 15శాతం ప్రకారం రూ.40 వేల కోట్లు కేటాయించాలన్నారు. కానీ కేవలం 21 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, అంబేడ్కర్ భరోసా పథకంపై స్పష్టత లేదన్నారు.

# బాలికలు ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి


కరాటే బెల్టులు అందుకున్న కస్తూర్బా విద్యార్థినులతో సీఐ ఎస్‌కే లతీఫ్

తొగుట, ఫిబ్రవరి 10: నేటి సమాజంలో బాలికల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదం చేస్తుందని తొగుట సీఐ ఎస్‌కే లతీఫ్ పేర్కొన్నారు. శనివారం తొగుటలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు కరాటే పోటీలు నిర్వహించి బెల్టులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు చదువుతోపాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలని సూచించారు. బాలికల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్నో చట్టాలను తీసుకువచ్చిందని ధైర్యంగా ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. అంతకుముందు 40మంది విద్యార్థినులకు ఆరెంజ్ బెల్ట్‌లు, 40మందికి ఎల్లో బెల్ట్‌లు ప్రదానం చేసి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ స్పెషలాఫీసర్ భాగ్యలక్ష్మి, జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ రాష్ట్ర చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాషా, జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాదాస్, పాఠశాల కరాటే ఇన్‌స్ట్రక్టర్ ప్రభాకర్, పాఠశాల పీఈటీ స్వప్న, బ్లాక్‌బెల్ట్ ఇన్‌స్ట్రక్టర్లు నవీన్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

# మూఢనమ్మకాలతో అపోహలకు తావివ్వొద్దు


కొడకండ్లలో కనువిప్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సైదా

గజ్వేల్, ఫిబ్రవరి 10: మూఢ నమ్మకాలతో అపోహలకు తావివ్వొద్దని గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ బి.సైదా ప్రజలకు సూచించారు. గజ్వేల్ మండలం కొల్గూరు గ్రామంలో శుక్రవారం రాత్రి కళాబృందం ఆధ్వర్యంలో ప్రజలకు కళాజాత ప్రదర్శన ద్వారా ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ హాజరై మాట్లాడుతూ నేటి హైటెక్ యుగంలో బాణామతి చేశారని అపోహలకు పోవద్దన్నారు. ఏదైనా అనారోగ్యం చేస్తే వెంటనే ఆసుపత్రిలో చూపించుకోవాలని సూచించారు. చిన్నచిన్న తగాదాలకు జీవితాలను నాశనం చేసుకోవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రభుత్వం పెండింగ్ చలాన్‌లపై ఈ నెల 15వ తేదీ వరకు ఇచ్చే రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుబడితే మొత్తం జరిమానాను చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్‌రూం నెంబర్ 8712667100కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. వారితో ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

# సేవ చేయడంలోని సంతృప్తి మరెక్కడా లభించదు


గజ్వేల్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ మీట్‌ను ప్రారంభిస్తున్న క్లబ్ 320డీ గవర్నర్ బాబురావు

గజ్వేల్, ఫిబ్రవరి 10: సేవ చేయడంలోని సంతృప్తి మరెక్కడా లభించదని లయన్స్ క్లబ్ 320డీ గవర్నర్ బాబురావు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో లయన్స్ క్లబ్ రీజియన్ మీట్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంపాక్ట్ ఫౌండర్, మోటివేషనల్ స్పీకర్ గంపా నాగేశ్వర్‌రావుతో కలసి ఆయన మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా సేవలను అందిస్తున్నదని, సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందన్నారు. ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని కలిగి ఉండాలని సూచించారు. అనంతరం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అంటేనే సేవకు మారుపేరని, లయన్స్ క్లబ్ గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌తో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా అనేక సేవలను అందిస్తున్నదని గుర్తు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, కార్యదర్శి సంజయ్‌గుప్తా, లయన్స్ క్లబ్ సీనియర్లు పరమేశ్వరాచారీ, రాంఫణీదర్, ఎలిశాల లింగం, నేతి శ్రీనివాస్, ఉప్పల మెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.



# వచ్చే ఎన్నికల్లో సత్తా చాటుదాం

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్


పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

అక్కన్నపేట, ఫిబ్రవరి 10: కార్యకర్తలు అధైర్య పడవద్దని, సైనికుల్లా పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం అక్కన్నపేట మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామని తెలిపారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమపార్టీ అని, పోరాటం కొత్త కాదని ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మళ్లీ పుంజుకుంటామన్నారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళల అందుబాటులో ఉంటానని చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు త్వరలోనే అన్ని గ్రామ కమిటీలను రద్దుచేసి నూతన కమిటీలను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జడ్పీటీసీ భూక్య మంగ, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెసరు సాంబరాజు, మాజీ జడ్పీటీసీ మాలోతు బీలునాయక్, మహిళా విభాగం అధ్యక్షురాలు వెల్ది శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శైశిరమాఘ నవరాత్రోత్సవాలు ప్రారంభం


చేర్యాల నుంచి పాదయాత్రగా తరలివెళ్తున్న భక్తులు

చేర్యాల, ఫిబ్రవరి 10: చేర్యాల మండలం చుంచనకోట గ్రామంలోని నారసింహ గురుస్థానం భువనేశ్వరీ మందిరంలో శనివారం శైశిరమాఘ నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి రంగురంగులపూలతో అలంకరించి విశేష పూజలు జరిపారు. పూర్ణాభిషేకం, మహాపూజ, కలశస్థాపన చేపట్టి వేడుకలు ప్రారంభించారు. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని భక్తులు శనివారం తెల్లవారుజామున స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి చుంచనకోట భువనేశ్వరీ మందిరం వరకు పాదయాత్రగా తరలివెళ్లారు. దారి పొడవునా అమ్మవారి నామస్మరణ, భజనలు చేపట్టారు.

## వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ దాడి

గజ్వేల్, ఫిబ్రవరి 10: గజ్వేల్ పట్టణంలో వ్యభిచార గృహంపై సిద్దిపేట జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టణంలోని సంగాపూర్ రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. హసీనా అలియాస్ రజియా అనే మహిళ తన ఇంటికి వేరే మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడుల్లో రజియాతో పాటు ములుగు మండలం తునికిబొల్లారం గ్రామానికి చెందిన ముట్ట గణేశ్‌తో పాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.500, 16 కండోమ్స్, 2సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గజ్వేల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## 62 లీటర్ల మద్యం స్వాధీనం.. ముగ్గురిపై కేసు

చేర్యాల, ఫిబ్రవరి 10 : చేర్యాల ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాగపురి శివారు నల్లపోచమ్మ ఆలయాల సమీపంలో సంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం దాడులు చేపట్టారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో అక్రమంగా నిల్వచేసిన 62లీటర్ల మద్యం పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యాపారులపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రైస్‌మిల్లర్‌పై దాడి ఘటనలో ముగ్గురి అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ దామోదర్

చేర్యాల, ఫిబ్రవరి 10 : చేర్యాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతి నారాయణపై ఇటీవల దాడికి పాల్పడిన సంఘటనలో కడవేరుగు గ్రామానికి చెందిన ఎలసాని స్వామి, ఎలసాని భాస్కర్, ఎలసాని నాగ రాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ దామోదర్ శనివారం విలేకరులకు తెలిపారు. దూళిమిట్ట మండలకేంద్రంలో పారా బాయిల్డ్ ఇండస్ట్రీస్ లావాదేవీలలో భాగస్వాముల మధ్య మనస్పర్థలు తలెత్తగా, ఎలసాని సుదాకర్, ఎలసాని భాస్కర్, ఎలసాని నాగ రాజు, ఎలసాని స్వామి, మరియాల ప్రవీణ్, మరియాల ఆంజనేయులు, మరియాల సత్తయ్య, మరియాల చంద్రయ్య తదితరులు ఈ నెల 8న ఉదయం నేతి నారాయణ ఇంటికి వెళ్లి దాడికి పాల్పడ్డారు. నేతి నారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసినప్పటికీ, వారిని అదుపులోకి తీసుకోకపోవడంతో బాధిత కుటుంబీకులు పోలీసుల తీరుపై శనివారం అసహనం వ్యక్తంచేశారు. దాడికి సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో అప్రమత్త మైన పోలీసులు నిందితులు ముగ్గురిని పట్టుకుని అరెస్ట్ చేశారు. మిగతావారు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు.

### భౌతిక దాడులకు పాల్పడటం సబబు కాదు

చేర్యాల రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నేతినారాయణపై ఇటీవల పలువురు భౌతికదాడులకు పాల్పడటాన్ని ఖండిస్తున్నామని ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తడక లింగమూర్తి అన్నారు. శనివారం ఆయన చేర్యాల పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రైస్‌మిల్లు వ్యాపార లావాదేవీల విషయంలో పొరపాట్లు తలెత్తితే సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప దౌర్జన్యం ప్రదర్శించడం సబబుకాదన్నారు.

## ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు

మద్దూరు, ఫిబ్రవరి 10: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపారు. మండలంలోని లద్నూర్ గ్రామానికి చెందిన జంగిటి చందు దూళిమిట్ట మండలంలోని బెక్కల్ జనిగెల వాగు నుంచి ట్రాక్టర్‌లో శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చెప్పారు.

## మద్దూరులో రేషన్ షాపుల తనిఖీ

మద్దూరు, ఫిబ్రవరి 10: మండలంలోని పలు రేషన్‌షాపుల్లో శనివారం పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దారు ఎమ్డీ జైనల్ అబిదీన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దూరు, రేబర్తి, వల్లంపట్ల, గాగిళ్లాపూర్, నర్సాయపల్లి గ్రామాల్లోని రేషన్‌షాపులను తనిఖీ చేశారు. సోషల్ ఆడిట్, బినామీ డీలర్లు ఎవరైనా ఉన్నారా అనే అంశంపై తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఆయన వెంట మండల రెవెన్యూ పరిశీలకులు రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎండీ కరీముద్దీన్, సెక్రటరీ వేణుగోపాల్‌తో పాటు పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాలకు గదులను అద్దెకు ఇవ్వొద్దు

చేర్యాల, ఫిబ్రవరి 10 : కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాల్లోని ప్రైవేటు లాడ్జీల యజమానులు ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలకు గదులను అద్దెకు ఇవ్వరాదని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. మల్లన్న ఆలయ టీటీడీ సత్రంలో శనివారం ప్రైవేటు గదుల యజమానులకు భద్రత తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో ఎస్ఐ నాగరాజు, పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'గృహజ్యోతి పథకానికి వివరాలు అందజేయాలి'

గజ్వేల్, ఫిబ్రవరి 10: గృహజ్యోతి పథకంలో భాగంగా వివరాల సేకరణ ఆలస్యమవుతున్నందున గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ కార్యాలయాల్లో తమ వివరాలను అందజేయాలని గజ్వేల్ విద్యుత్ శాఖ ఏడీఈ జగదీశ్ ఆర్య తెలిపారు. గృహజ్యోతి వినియోగదారులు తమ కరెంట్ బిల్లు, ప్రజాపాలన దరఖాస్తు నెంబర్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జిరాక్సు ప్రతులను ఆయా కార్యాలయాల్లో అందించాలన్నారు. గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డు చౌరస్తాలో గల ఏఈ కార్యాలయంలో, గజ్వేల్ పోలీస్ స్టేషన్ ఎదుట గల ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో, ఢిల్లీవాలా హోటల్ వద్ద ఈఆర్‌వో కార్యాలయంలో, ప్రజ్ఞాపూర్‌లోని ఏసీపీ కార్యాలయం వద్ద గల ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయంలో, జగదేవ్‌పూర్ రోడ్డులోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ వద్ద గల ప్రజ్ఞాపూర్ ఏఈ కార్యాలయంలో ఈ నెల 12లోగా సమర్పించాలని కోరారు.

## కాగ్నిజెంట్ టెక్నాలజీ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతా సుబ్రహ్మణ్యం

వర్గల్, ఫిబ్రవరి 10 : వర్గల్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్సియల్ మహిళ డిగ్రీ కళాశాలలో శనివారం కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ఎంప్లాయబిలిటీ స్కిల్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ డైరెక్టర్ చింతా సుబ్రహ్మణ్యం హాజరై విద్యార్థులకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ గోవిందరావు, ప్లేస్‌మెంట్ ఇన్‌చార్జి నిఖిత తదితరులు ఉన్నారు.

## ప్రమాదకర కల్వర్టుకు మరమ్మతులు



వల్లంపట్ల-కూటిగల్ రహదారిపై చేపట్టిన కల్వర్టు మరమ్మతులు

మద్దూరు, ఫిబ్రవరి 10: మండలంలోని వల్లంపట్ల గ్రామం నుంచి దూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామానికి వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారిన కల్వర్టుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల 'ప్రమాదం పొంచి ఉన్నా పట్టదా' అంటూ ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ ఏఈ సందీప్ మాట్లాడారు. కల్వర్టు మరమ్మతులకు స్టేట్ గవర్నమెంట్ నుంచి నిధులు రూ. 1.40 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఇరువైపులా కూలిన కల్వర్టుకు బాడీవాల్స్ నిర్మించడంతో పాటు గుంతల్లో మట్టి నింపుతున్నామన్నారు. ఈ రోడ్డుపై వాహనదారులు ఇకపై సాఫీగా రాకపోకలు సాగించవచ్చని భరోసా ఇచ్చారు.